క్లుప్తంగా

వర్షాలు కురిపించు తల్లీ గంగమ్మ


లక్కిరెడ్డిపల్లె: అమ్మవారి సన్నిధిలో ఎంపీపీ

సంబేపల్లె : మండల కేంద్రం పరిధిలో వెలసిన దేవరరాయి నల్లగంగమ్మకు మహిళలు, భక్తులు బోనాలు సమర్పించారు. ఆదివారం కావడంతో వేకువజాము నుంచే అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వర్షాలు కురిసి పాడి పంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని, అలాగే ప్రజలందరినీ చల్లంగా చూడమ్మా అంటూ భక్తులు తల్లిని వేడుకున్నారు.

అనంతపురం గంగమ్మకు ప్రత్యేక పూజలు


నల్లగంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

లక్కిరెడ్డిపల్లె : వర్షాలు కురిపించి ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండేలా కరుణించి గంగమ్మ తల్లి అంటూ అనంతపురం గంగమ్మకు ఆదివారం భక్తులు పూజలు చేశారు. అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ చైర్మన్ మురికినాటి రెడ్డయ్య, ఆలయ ఈఓ మారుతీలు ఆలయ మర్యాదలతో ఎంపీపీకి అమ్మవారి దర్శనాన్ని కల్పించి ప్రసాదాలను అందజేసి సత్కరించారు. అమ్మవారి దర్శనార్థం వేలాది మంది భక్తులు ఆలయానికి వచ్చారు.

లయన్స్ క్లబ్‌కు అవార్డుల వెల్లువ



ఉత్తమ క్లబ్ అధ్యక్షుడి అవార్డు అందుకుంటున్న మహమ్మద్

రాయచోటి అర్బన్ : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సభ్యులకు అవార్డులు వెల్లువెత్తినట్లు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీఎస్ హరినాథరెడ్డి తెలిపారు. 2022 – 2023 సంవత్సరానికి గాను 650 సేవా కార్యక్రమాలను నిర్వహించినందుకు లయన్ డిస్ట్రిక్ట్ 316జే పరిధిలోని క్లబ్‌కు అవార్డుల పంట పండింది. డిస్ట్రిక్ట్ పరిధిలో ఉత్తమ క్లబ్‌గా, ఉత్తమ అధ్యక్షుడిగా షేక్ మహమ్మద్, ఉత్తమ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ అడ్వైజర్‌గా పీఎస్ హరినాథరెడ్డి, ఉత్తమ జోన్ చైర్మన్‌గా కుసుమాకర్‌లు ఎంపికయ్యారు. వీరికి ఆదివారం రాత్రి ప్రొద్దుటూరులో జరిగిన సభలో లయన్ డిస్ట్రిక్ట్ 316జె గవర్నర్ చంద్రప్రకాష్‌రావు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి వి.హరీష్‌చంద్ర, నందిని ట్రావెల్స్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరి ఓటు వారే వేయాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ షరీఫ్

సిద్దవటం : సార్వత్రిక ఎన్నికల్లో ఎవరి ఓటు హక్కును వారు వినియోగించుకోవాలని కడప డీఎస్పీ ఎస్ఎండీ షరీఫ్ తెలిపారు. సిద్దవటం మండలంలోని భాకరాపేటలో ఆదివారం సార్వత్రిక ఎన్నికలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఐకమత్యంతో ఉండాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ సజావుగా జరిగే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. పోలీసు వ్యవస్థ పార్టీలకు అతీతంగా పనిచేస్తుందన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఏవైనా అనుకోని సంఘటలను జరిగితే అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. కడప – చెన్నై ప్రధాన రహదారిలో వాహనాలు అతివేగంగా వెళుతున్నాయని ఎటువంటి ప్రమాదాలు జరగకుండా స్పీడ్ బ్రేకర్‌లను ఏర్పాటు చేయాలని స్థానికులు డీఎస్పీకి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, ఎస్ఐ పెద్దఓబన్న, పోలీసులు పాల్గొన్నారు.

12 లీటర్ల సారా స్వాధీనం

నిమ్మనపల్లె : సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సి.లోకేష్ రెడ్డి తెలిపారు. ఆదివారం కొండయ్యగారిపల్లె పంచాయతీకి చెందిన పల్లపురవి కొండయ్యగారిపల్లెకు సమీపంలో సారా విక్రయిస్తున్నాడన్న సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడిచేశామన్నారు.

అతనివద్ద నుంచి 12లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ దాడిలో పోలీస్‌సిబ్బంది రాజేష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి 'ఫ్యాన్'కు ఓటేద్దాం

- తాళ్లపాక పంచాయతీలో ఎన్నికల ప్రచారం
- పాల్గొన్న రాజ్యసభసభ్యులు మేడా రఘునాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట రూరల్ : ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి రాష్ట్రాభివృద్ధికి దోహదపడదామని రాజ్యసభసభ్యులు మేడా రఘునాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డిలు ఓటర్లకు తెలియజేశారు. మండల పరిధిలోని తాళ్లపాక పంచాయతీలోని సిద్దలపల్లి గ్రామంలో సార్వత్రిక ఎన్నికల ప్రచారాన్ని ఆదివారం ప్రారంభించారు. గ్రామంలోకి విచ్చేసిన ఎంపీ మేడా, ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటిలకు స్థానిక నాయకులు, కార్యకర్తలు బాణసంచా పేలుళ్లు, బాజాభజంత్రీల నడుమ గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం వారు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. పథకాలు కొనసాగాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జననేత జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు. ఎంపీగా పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డికి ఒక ఓటు, ఎమ్మెల్యేగా ఆకేపాటి అమరనాథరెడ్డికి మద్దతుగా ఒక ఓటు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, వేయించి గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్‌లు చొప్పా ఎల్లారెడ్డి, పీసీ యోగీశ్వరరెడ్డిలతోపాటు స్టేట్ డైరెక్టర్లు, పార్టీ వివిధ విభాగాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో రఘునాథరెడ్డి

నందలూరు(రాజంపేట) : పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నాగిరెడ్డిపల్లి గ్రామంలోని జామియా మసీద్‌లో జనాబ్ ఎస్టీఖాన్ ఛారిటబుల్ ట్రస్టు సయ్యద్ అమీర్, షమీవుల్లాఖాన్, కరిముల్లాఖాన్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో రాజ్యసభ ఎంపీ మేడా రఘునాథరెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లింలు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించుకునే పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలను చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఎంతో భక్తితో ఉంటారన్నారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి వారు ప్రార్థనలు చేశారు. మసీదులో వాష్‌రూమ్ సమస్యను ఎంపీ దృష్టికి తీసుకుపోగా వెంటనే స్పందించిన ఆయన ఏర్పాటు చేసేందుకు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.


నందలూరు మండలం లేబాకలో ప్రచారం చేస్తున్న ఎంపీ మేడా, అనిల్‌రెడ్డి, ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే కాపులకు పెద్దపీట

నందలూరు(రాజంపేట) : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే కాపుల సంక్షేమానికి పెద్దపీట వేశారని రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి అన్నారు. రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డి సోదరుడు అనిల్‌రెడ్డి, నందలూరు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డితో కలిసి నందలూరు మండలంలోని లేబాక, మరాఠపల్లె, హరిజనవాడ, అరుంధతివాడలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపుల (బలిజలు)ను రాజకీయం పరంగా, ఆర్థిక పరంగా అభివృద్ధి చెందడానికి సీఎం జగన్ కృషి చేశారన్నారు. క్యాబినెట్‌తోపాటు కార్పొరేషన్ పదవుల కేటాయింపులోనూ ఉన్నత స్థానం కల్పించారన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పీవీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆకేపాటి అనిల్ రెడ్డి కోరారు. తాము నియోజకవర్గంలో కాపులకు అండగా ఉంటామని, వారికి ఏ సమస్య వచ్చిన తాము ముందంటామన్నారు. నందలూరు మండలాధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ వెంట కాపులు నడుస్తున్నారన్నారు. మండలంలో కాపులు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుపునకు తమ వంతుగా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గడికోట ఉషాసుబ్బారెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు అన్నం నాగేంద్ర, గీతాల నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి, ఓర్స్ శ్రీను, దళిత నాయకులు నాగసుబ్బయ్య, కాకి చంద్ర, సత్యాల రామకృష్ణ, బీసీ నేత భాస్కర్‌యాదవ్, సురేంద్ర మైనార్టీ నేత పఠాన్ అక్బర్‌ఖాన్, స్థానిక నాయకులు లేబాక సంజీవి, బొక్కే రమణ, మాజీ సర్పంచి లింగాల పెంచలయ్య, జ్యోతి, ఎల్లయ్య, పొట్టి జగన్, పిచ్చయ్య, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా లేబాక గ్రామంలో మేడా, ఆకేపాటిలకు ఘన స్వాగతం లభించింది. వైఎస్సార్‌సీపీ చేపట్టిన ప్రచారానికి అనుహ్య స్పందన లభించింది.


ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఆకేపాటి, పక్కన రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి

చంద్రబాబు మాటలు నమ్మి మోసపోవద్దు

గాలివీడు : ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందాయని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సోదరుడు, మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గడికోట సుధీప్‌రెడ్డి అన్నారు. ఆదివారం వైఎస్సార్ వెలిగల్లు గ్రామంలో స్థానిక, మండల నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలు రాయచోటి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించారని, ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపారన్నారు. నిరుద్యోగ యువతీయువకులకు ఉపాధి అవకాశాలు కల్పించారని చెప్పారు. ప్రజలు చంద్రబాబు మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు తెలియజేశారు. ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోమారు వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ జల్లా పద్మావతమ్మ, వైస్ ఎంపీపీ యదుభూషన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగభూషన్‌రెడ్డి, జెడ్పీటీసీ ఖాదర్ మొహిద్దిన్, సర్పంచ్‌లు బాబా ఫక్రుద్దిన్, ఉమాపతిరెడ్డి, చెన్నకేశవరెడ్డి, ఎంపీటీసీ నవాజ్, మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు నాగేశ్వరమ్మ, రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో గడికోట సుధీప్‌రెడ్డి

శాంతి కాముకుడు శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్ : రాయచోటి నియోజవర్గ శాంతి కాముకుడు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అని సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి శ్యామ్, శిబ్యాల విజయభాస్కర్‌లు అన్నారు. ఆదివారం రాయచోటిలోని ఒకటవ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాంత్‌రెడ్డి రాయచోటికి మొదటి సారిగా 2009లో వచ్చాడని అప్పటి వరకు రాయచోటిలో ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి ఉండేదన్నారు. కానీ ఆయన వచ్చాక ఎక్కడ గొడవలు, కొట్లాటలు లేకుండా ప్రశాంతంగా ఉండే విధంగా పట్టణాన్ని మార్చారన్నారు. రాయచోటిని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళుతున్నారన్నారు. అందుకే ఆయనను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని కోరారు. కాపులకు ప్రత్యేకంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఇచ్చి పెద్దపీట వేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మోక్షిత్, అమీర్ బాషా, జావీద్, హుస్సేన్, విక్కీ, సూర్య తదితరులు పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులు

సంక్షేమాభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

- జగన్ పాలనలో బడుగు బలహీనవర్గాలకు పెద్దపీట
- మల్లూరు, కొత్తపల్లె గ్రామాల్లో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి జననీరాజనం

చిన్నమండెం : రాష్ట్రంలో పేదలకు సంక్షేమ పథకాల ద్వారా రూ.2.70 లక్షల కోట్లను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం చిన్నమండెం మండలంలోని మల్లూరు, కొత్తపల్లె పంచాయతీల పరిధిల్లోని గ్రామాల్లో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథ రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారాన్ని శ్రీకాంత్‌రెడ్డి నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును, అభివృద్ధిని వివరించారు. సీఎం వైఎస్ జగన్‌తోనే సంక్షేమాభివృద్ధి సాధ్యమన్నారు. రాబోయే ఎన్నికలలో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి, వేయించాలని శ్రీకాంత్‌రెడ్డి అభ్యర్థించారు.

బీసీలంటే సమాజానికి వెన్నెముక

బీసీలంటే సమాజంలో వెనుకబడిన కులాలు కాదని, సమాజానికి వెన్నెముక వర్గాలని చాటి చెప్పి తమ అభివృద్ధికి బాటలేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అంటూ కొత్తపల్లె గ్రామంలో వడ్డెర, కురవ తదితర బీసీ కులాలు శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథ రెడ్డిల ఎదుట హర్షం వ్యక్తం చేశారు. 18 మంది ఎమ్మెల్సీ స్థానాలకు గాను 11 మంది బీసీలు, 2 ఎస్సీలు, 1 ఎస్టీలకు సీట్లను ఇచ్చారని, ఇందులో ఇద్దరి వడ్డెర కులాల వారిని ఎమ్మెల్సీలుగా చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. అసెంబ్లీ స్పీకర్‌గా బీసీ, మండలి చైర్మన్‌గా ఎస్సీ, డిప్యూటీ చైర్‌పర్సన్ పదవిని మైనార్టీ మహిళకు ఇవ్వడమన్నది ఒక రికార్డు అని బీసీలు చెప్పారు. వార్డు స్థాయి నుంచి రాజ్యసభ దాకా 70 శాతం పదవులు బడుగు, బలహీనవర్గాలకు పదవులు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని వారు పేర్కొన్నారు. సంక్షేమంతోపాటు రాజకీయంగా బీసీలకు అవకాశం కల్పిస్తున్న సీఎం జగన్ వెంట నడిచేందుకు సిద్ధంగా ఉన్నామంటూ ముక్తకంఠంతో వెనుకబడిన వర్గాల ప్రజలు నాయకులకు తెలియజేశారు. కాగా మల్లూరు కస్పాలో శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథరెడ్డిలకు ఇంటింటా ఆత్మీయ స్వాగతాలు లభించాయి. ఎన్నికలు ప్రచారానికి మైనార్టీ సోదరులు జేజేలు పలుకగ, కొండకిందపల్లెలో చేనేతలు అక్కున చేర్చుకున్నారు.


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు

జగన్ ప్రభుత్వంలోనే వాల్మీకులకు ప్రత్యేక గుర్తింపు

వాల్మీకులకు ప్రత్యేకంగా సీఎం జగన్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి కృషి చేయడం అభినందనీయమని కొత్తపేటలో వాల్మీకి సోదరులు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డితో అన్నారు. మహర్షి వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా జరపడం వాల్మీకులకు ఎంత విలువ ఇస్తున్నారో తెలుస్తోందన్నారు. ప్రచార కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ శ్యామ్‌చంద్ర, మాజీ సర్పంచ్ అమ్మాజీ, వైఎస్ఆర్‌సీపీ నాయకులు షఫీ, సర్పంచ్ లక్ష్మీరెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, కొత్తపల్లె సర్పంచ్ భూమసాని అంజలి, నాయకులు లక్ష్మీరెడ్డి, సురేంద్రారెడ్డి దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చక్రపాణిరెడ్డి, అన్వర్‌బాషా, మండల జేసీఎస్ కన్వీనర్ అంజనప్ప, పిల్ల బయారెడ్డి, గురునాథ్, దేవేంద్రరెడ్డి, హుసేన్‌బాషా, జాఫర్, బయారెడ్డి, వెంకట్రామిరెడ్డి, రాజారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, చంద్రారెడ్డి, వెంకీ, కిరణ్, బుడ్డ శ్రీను, ప్రతాప్‌రెడ్డి, రమణ, జగన్, ఈశ్వరయ్య, రెడ్డప్ప, సుధాకర్, మౌలా, రెడ్డిబాషా, ఖాజా హుస్సేన్, ముబారక్, సర్పంచులు ముసల్‌రెడ్డి, లోకేశ్వరరెడ్డి, నజీర్ అహమ్మద్, వెంకటరమణ, ఎంపీటీసీలు రమణ, వెంకటప్పనాయుడు, రెడ్డప్ప, గంగులయ్య, మాజీ ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డి, గౌస్‌సాబ్, బుర్హాన్‌ఖాన్, యహియాఖాన్, గురివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని ఆప్యాయంగా పలుకరిస్తున్న వృద్ధురాలు

ఇఫ్తార్ విందు మహా పుణ్యకార్యం


పుల్లంపేట: ఎంపీపీని సన్మానిస్తున్న ముస్లిం సోదరులు


సిద్దవటం: ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఆకేపాటి, మేడా మధుసూదన్‌రెడ్డి

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామ పంచాయతీ మహబూబ్‌నగర్ గ్రామంలోని మసీదు వద్ద ఆదివారం రాత్రి వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ నాయకుడు నాయూబ్ రసూల్ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇఫ్తార్ విందు కార్యక్రమానికి వైఎస్ఆర్‌సీపీ రాజంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం ముస్లిం సోదరులకు ముందుస్తు రంజాన్ శుభాకాంక్షలను తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, మైనార్టీసెల్ కార్యదర్శి వల్లిచాన్, ముస్లింలు పాల్గొన్నారు.

పుల్లంపేట : ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఆదివారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది రంజాన్ మాసంలో ఉపవాసాలు ఆచరించే ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ఆనవాయితీ. ముస్లిం సోదరులకు ఎటువంటి సమస్య ఉన్నా తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుదర్శన్ రెడ్డి, గంగాధర్, సురేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముస్లిం సోదరులు ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డిని సన్మానించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మదనపల్లె : కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు తాలూకా సీఐ ఎన్.శేఖర్ తెలిపారు. వైఎస్సార్ కడప, సీఎంఆర్‌పల్లెకు చెందిన భాస్కర్ కుమారుడు టి.మణికంఠ(25) కర్ణాటక నుంచి బ్లాక్‌డాగ్ విస్కీ మూడు ఫుల్ బాటిల్స్ ఆర్టీసీ బస్సులో అక్రమంగా తరలిస్తుండగా మండలపరిధిలోని రాష్ట్ర సరిహద్దు చీకలబైలు చెక్‌పోస్ట్ వద్ద తనిఖీల్లో భాగంగా స్వాధీనం చేసుకున్నామన్నారు. మద్యం విలువ రూ.2,100 ఉంటుందని తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బి.కొత్తకోట : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఈబీ అధికారులు పట్టుకుని ఆదివారం పోలీసులకు అప్పగించారు. మండలంలోని బడికాయలపల్లెకు చెందిన నవీన్(23) ట్రాక్టర్‌లో ఇసుకను బి.కొత్తకోటకు తరలిస్తున్నాడు. దీనిపై దాడులు నిర్వహించి అనుమతి లేదని నిర్ధారించారు. నవీన్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

రోగులకు వైద్యమందించడం అభినందనీయం

రాయచోటి అర్బన్ : రాయచోటి లయన్స్ కంటి ఆసుపత్రి ద్వారా 15వేల మంది పేదలకు కంటి ఆపరేషన్‌లు చేయడం గొప్ప కార్యక్రమం అని తిరుపతి ఎస్‌వీ మెడికల్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ బలరామరాజు అన్నారు. క్లబ్ ద్వారా 15వేల ఆపరేషన్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆసుపత్రిలో అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాయచోటి లాంటి అత్యంత వెనుకబడిన ప్రాంతంలో ది రాచవీడు లయన్స్ క్లబ్ ద్వారా కంటి ఆసుపత్రిని ఏర్పాటు చేసి 15వేల ఆపరేషన్లు పూర్తి చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కంటి ఆసుపత్రి ద్వారా అందే సేవలకు తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు బయారెడ్డి, సంగమ్మ, మహేశ్వరరాజు, శ్రీనివాసకుమార్‌రాజు, క్లబ్ మాజీ అధ్యక్షుడు చెన్నూరు అన్వర్‌బాషా, ఆసుపత్రి చైర్మన్ స్వరూప్ గుప్తా, కోశాధికారి శివప్రసాద్‌రెడ్డి, దాత మిఠాయి గిరి ఖాసింసాహెబ్, లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ శివరామిరెడి, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డిలతోపాటు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


డాక్టర్ బలరామరాజును సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

భక్తిశ్రద్ధలతో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

వాల్మీకిపురం : వాల్మీకిపురం పట్టాభిరామాలయంలో ఆదివారం టీటీడీ ఆధ్వర్యంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలకు ముందు జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్యంగా ఆలయ గర్భగుడి మొదలు పరిసరాలు, రాముడి బ్రహ్మ రథానికి సుగంధ ద్రవ్యాలతో శుద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, నాగరాజ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.


కోయిల్ ఆళ్వార్ సేవలో అర్చకులు, భక్తులు

జగన్ ప్రభుత్వంలోనే కోడూరు అభివృద్ధి

- కోడూరుకు చంద్రబాబు చేసింది శూన్యం
- వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలు, పేదలే బలం
- నాయకులు, కార్యకర్తల సమావేశంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు ప్రతి గడపకు వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని తెలియజేయాలని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు కార్యకర్తలకు సూచించారు. ఆదివారం స్థానిక మండల పార్టీ కార్యాలయంలో రూట్ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అలాగే వారికి రూట్ ప్రచార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం చేతల్లో చేసి చూపిన వ్యక్తి మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని అన్నారు. ప్రతి గ్రామంలో, ప్రతి పంచాయతీలో ఎనభై శాతం మందికి ప్రభుత్వ పథకాల లబ్ధి పొందారన్నారు. అలాగే పార్టీకి కార్యకర్తలు, పేద ప్రజలు బలమని పేర్కొన్నారు. చేసిన అభివృద్ధి అందించిన సంక్షేమంతో ప్రతి కార్యకర్త కాలర్ ఎత్తుకొని ప్రజల్లోకి ధైర్యంగా వెళ్లేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేసిందన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గానికి గత టీడీపీ ప్రభుత్వం చేసింది శూన్యమని చెప్పారు. చంద్రబాబు గుంటనక్క ఉపన్యాసాలు, రాజకీయ వ్యూహాలకు కాలం చెల్లిందన్నారు. రాష్ట్రంలో టీడీపీని భూస్థాపితం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా పింఛన్ పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చి వలంటీర్ల ద్వారా అందిస్తుంటే చంద్రబాబు కుట్రపూరితంగా ఆపారని తెలియపరిచారు. చంద్రబాబు నీచ రాజకీయాలతో వృద్ధులు, దివ్యాంగులు అవస్థలు పడ్డారని, వారి ఉసురు బాబుకు తప్పక తగలుతుందన్నారు. నియోజకవర్గంలో వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశామని, మరికొన్ని పనులకు శ్రీకారం చుట్టామని వివరించారు. రాబోయే రోజుల్లో ప్రజల దీవెనలు, ఆశీస్సులతో రైల్వేకోడూరు సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని హామీనిచ్చారు. అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా 9 రైల్వే అండర్ బ్రిడ్జిలు, గ్రీన్ హైవేను మంజూరు చేయించిన ఘనత ఎంపీ మిథున్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. డబ్బుతో ప్రజలను కొనాలనుకునే ప్రతిపక్షాల దుష్ట రాజకీయాలు చెల్లవన్నారు. ఈ ఎన్నికల్లో ప్రతిపక్షాలకు 21 స్థానాలు కూడా రావని జోస్యం పలికారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో పదికి పది సీట్లు మనమే గెలుస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు.


బూత్ కన్వీనర్లకు కిట్‌ను అందిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, కొల్లం గంగిరెడ్డి


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ప్రభుత్వవిప్ కొరముట్ల

ఘనంగా ఇఫ్తార్ విందు..

రైల్వేకోడూరు పట్టణంలోని డాల్ఫిన్ డేల్ హై స్కూల్‌లో ముస్లిం సోదరులకు రంజాన్ పర్వదినాన్ని పురస్కరించకొని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. వేలాది మంది ముస్లిం సోదరులు, నాయకులు, ప్రజలు కార్యకర్తలు విందులో పాల్గొన్నారు. అనంతరం కొరముట్లనే ముస్లిం సోదరులు ఆహారం వడ్డించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నియోజకవర్గ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, ముప్పాల హేమనవర్మ, జెడ్పీటీసీ రత్నమ్మ, మార్కెట్ చైర్మన్ సుబ్బరామరాజు, చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, జనార్దన్ రాజు, సుధాకర్ రాజు, కొరెడ్డి సిద్దయ్య, సీహెచ్ రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, బూత్ కన్వీనర్లు, ముస్లిం సోదరులు అన్వర్ బాషా, కరిముల్లా, అబ్దుల్ రౌఫ్, ఇర్ఫాన్ నవాబ్, ముజీబ్ పాల్గొన్నారు.

రెడ్డెమ్మ తల్లీ.. కరుణించమ్మా..

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి వేకువజాము నుంచే భక్తులు చేరుకొన్నారు. మహిళలు అమ్మవారి కోనేట్లో స్నానమాచరించి సంతాన కోసం అమ్మవారి ఎదుట వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. హిందువులతో పాటు ముస్లింలు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారికి దర్శించుకున్నారు.


సంతానం కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

పొట్టేళ్లకు గిరాకీ

పీలేరు రూరల్ : రంజాన్‌మాసంను పురష్కరించుకుని పొట్టేళ్లకు భలే గిరాకీ ఏర్పడింది. ఆదివారం పీలేరు పట్టణంలోని మార్కెట్ యార్డులో గొర్రెల సంత వినియోగదారులతో కిటకిటలాడింది. ఈ సంతకు పక్క రాష్ట్రాల నుంచి వ్యాపారులు అధిక సంఖ్యలో రావడంతో గిరాకీ ఏర్పడింది. ఈ వారంలో రంజాన్, ఉగాది పండుగలు ఉండడంతో పొట్టేళ్లు, మేకపోతులు కొనడానికి పెద్ద ఎత్తున ఎగబడ్డారు. దీంతో ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. రూ. 10 వేల నుంచి రూ. 50 వేల వరకు ధర పలికాయి.